
సాక్షి
పల్నాడు
గురువారం । 22 । ఆగస్టు । 2024



నేడు రామాలయ పునఃప్రతిష్ట

నాదెండ్ల: చిరుమామిళ్ల నడింబజారులో రూ.60 లక్షలతో నిర్మించిన శ్రీ రామమందిరంలో విగ్రహ పునః ప్రతిష్టా మహోత్సవం గురువారం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.



నీలంపాటి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం

శావల్యాపురం: కనమర్లపూడిలోని శ్రీ నీలంపాటి అమ్మవారి ఆలయ నాలుగో వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. మూల విరాట్‌ను అలంకరించి పూజలు చేశారు.

నేడు లక్ష్మీగణపతి హోమం



దాచేపల్లి : స్థానిక శ్రీ బీర్ల అంకమ్మతల్లి దేవాలయంలో గురువారం లక్ష్మీ గణపతి హోమం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యుడు యలమల నరేష్ తెలిపారు. దీంతో పాటు చండీ హోమం కూడా జరుగుతుందని, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

న్యూస్‌రీల్

చేపలకు వల వేస్తే కొండచిలువ చిక్కింది



ప్రత్తిపాడు: చేపలకు వల వేస్తే అందులో కొండచిలువ చిక్కింది. ప్రత్తిపాడుకు చెందిన చెర్లోపల్లి శ్రీనివాస్ స్థానిక రామవాగులో చేపలు పట్టేందుకు బుధవారం ఉదయం వల విసిరాడు. అందులో ఓ చేపతో పాటు తొమ్మిది అడుగుల కొండచిలువ చిక్కుకుంది. గమనించిన జాలరి విషయాన్ని స్థానికుల ద్వారా పోలీసులకు తెలియజేశాడు. ఎస్‌ఐ కె. నాగేంద్ర అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. వారు వచ్చి కొండ చిలువను స్వాధీనం చేసుకుని, నడింపాలెం సమీపంలోని అటవీ ప్రాంతంలో సురక్షితంగా వదిలేశారు.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తు చేసుకోండి

డీఈఓ వెంకటేశ్వర్లు

నరసరావుపేట ఈస్ట్: ప్రభుత్వ యాజమాన్యాలలోని అన్ని పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు 2024–25 విద్యా సంవత్సరానికి జరగనున్న నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ కె.ఎం.ఏ.హుస్సేన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు, ఆదర్శ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతూ, కుటుంబ వార్షిక ఆదాయం రూ. 3.50 లక్షలు లోపు ఉన్న విద్యార్థులు పరీక్ష రాసేందుకు అర్హులని వివరించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసేందుకు సెప్టెంబర్ 6వ తేదీ, పరీక్ష రుసుం చెల్లించేందుకు సెప్టెంబర్ 10వ తేదీ తుది గడువు అని తెలిపారు. పరీక్ష డిసెంబర్ 8వ తేదీన నిర్వహిస్తారన్నారు. పరీక్ష రుసుం ఇతరులు రూ.100 , ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50ను ఆన్‌లైన్‌లో ఎస్‌బీఐ లింక్ ద్వారా మాత్రమే చెల్లించాలని తెలిపారు.

వైభవంగా శివుడి విగ్రహ ప్రతిష్టా మహోత్సవం



మంగళగిరి : పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన శివుడి విగ్రహ ప్రతిష్టా మహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. తొలుత ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. శివుడి విగ్రహాన్ని దాతలు మాదల వేంకటేశ్వరరావు, అంజమ్మ దంపతులు మూడేళ్ల కిందట ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాదల గోపీకృష్ణ, భోగి కోటేశ్వరరావు, తులిమిల్లి రామకృష్ణ, నిరీష, వెంకటకృష్ణ, రమ్య, మాధవి తదితరులు పాల్గొన్నారు.

సత్తెనపల్లి-విజయవాడకు కొత్త ఆర్టీసీ బస్సు



సత్తెనపల్లి: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో సత్తెనపల్లి–విజయవాడ రూట్‌కు నూతన ఆర్టీసీ బస్సును స్థానిక శాసన సభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ బుధవారం ప్రారంభించారు. అనంతరం నాయకులతో కలిసి బస్సు ఎక్కి మొదటి టికెట్ కొనుగోలు చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ జీఎస్‌వీవీ.కుమార్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అటవీ జాతి మొక్కలతో అదనపు ఆదాయం

సత్తెనపల్లి: వ్యవసాయ భూమిలో అటవీ జాతి మొక్కలు నాటితే అదనపు ఆదాయం లభిస్తుందని టీఓఎఫ్‌ఏ ప్రోగ్రాం రాష్ట్ర అసోసియేట్ మారపల్లి ప్రణీత్‌వర్మ అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం బృగుబండ గ్రామంలో అటవీయేతర ప్రాంతంలో బుధవారం చెట్ల పెంపకంపై రైతులకు నిర్వహించిన శిక్షణ సదస్సులో ఆయన మాట్లాడారు. రైతులకు ఆగ్రో ఫారెస్ట్ మీద అవగాహన, శిక్షణ నిర్వహించారు. అటవీజాతి మొక్కలను వ్యవసాయ భూముల్లో నాటితే వాటి వల్ల వచ్చే ఉపయోగాలు, అదనపు ఆదాయం గురించి రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. ఉద్యాన శాఖ వీఏఏ జీవనజ్యోతి పాల్గొన్నారు.

పులిచింతల

నీటి చింతలు తీరేలా



పూర్తి సామర్థ్యంతో పులిచింతల ప్రాజెక్టు

నీటికి చింత లేకుండా పులిచింతల ప్రాజెక్టు నిండింది. పైనుంచి కృష్ణమ్మ బిరాబిరా వచ్చి చేరడంతో నిండుకుండను తలపిస్తోంది. కృష్ణా, డెల్టా ప్రాంత రైతాంగం ఏడాదిపాటు నిశ్చింతగా రెండు పంటలు పండించుకునే అవకాశం దక్కింది.అపర భగీరథుడు వైఎస్సార్ రెండు దశాబ్దాల కిందట వేసిన బీజం నేడు వరంగా మారింది. పంట భూములు సస్యశ్యామలంగా మారాయి. వచ్చే ఏడాది సెప్టెంబరు వరకు 23లక్షల హెక్టార్ల ఆయకట్టు భూములకు సమృద్ధిగా సాగునీరు అందనుంది. ప్రాజెక్టు జలాశయం పూర్తి సామర్థ్యంతో నిండటం వరుసగా ఇది అయిదో ఏడు. ప్రస్తుతం 45.77 టీఎంసీలు నిల్వ ఉంచడం వల్ల ఖరీఫ్, రబీ పంట సీజన్లకు సమృద్ధిగా సాగునీరు సరఫరా అవుతుంది.

- నిండు కుండలా ప్రాజెక్ట్
- జలాశయంలో 45.70 టీఎంసీల నిల్వ
- 23 లక్షల హెక్టార్లకు ఏడాది పాటు పుష్కలంగా సాగునీరు
- రెండు దశాబ్దాల కిందట నిర్మాణ పనులు ప్రారంభం
- మూడేళ్ల కిందట వైఎస్. జగన్ పాలనలో ఆధునికీకరణ

అచ్చంపేట: సరిగ్గా రెండు దశాబ్దాల కిందట 2004లో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్. రాజశేఖరరెడ్డి ప్రాజెక్టు పనులకు శ్రీకారం చుట్టారు.ఈ ప్రాంతంలో పులిచింతల ప్రాజెక్టు నిర్మాణానికి అనువైన స్థలంగా ప్రముఖ ఇంజనీర్ కె.ఎల్. రావు గుర్తించారు. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉండగా రెండుసార్లు ప్రాజెక్టు నిర్మాణానికి విఫలప్రయత్నం చేశారు. బ్రిటిష్ హయాంలోనూ ఇక్కడ ప్రాజెక్టు నిర్మాణ పనులు సాధ్యపడలేదు. 2004లో మహానేత శిలాఫలకాన్ని ఆవిష్కరించినా నిర్మాణ పనులకు మావోయిస్టుల హెచ్చరికలు, పర్యావరణ అనుమతులు, తరచూ తుపానులు వంటి అవాంతరాలు ఎన్నో వచ్చాయి. అన్నింటిని అధిగమించి ప్రాజెక్టు నిర్మాణం చేయడమే లక్ష్యంగా డాక్టర్ వైఎస్సార్ ముందుకు సాగారు. 2014లో పనులు పూర్తయ్యాయి. ప్రాజెక్టు అయితే పూర్తయింది గానీ 2019వరకు రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులవల్ల పూర్తి సామర్థ్యంతో నీటిని నింపడం సాధ్యపడలేదు. 20 నుంచి 25 టీఎంసీలలోపే నీరు ఉండటంతో కృష్ణా, డెల్టా ఆయకట్టు భూములకు అరకొరగానే సాగునీరు సరఫరా అయింది.



కృష్ణా, డెల్టా ప్రాంతాలకు ప్రాజెక్టు గేట్ల ద్వారా విడుదలవుతున్న సాగునీరు

2019 నుంచి వరుసగా నిండుతున్న ప్రాజెక్టు

2019 సెప్టెంబరులో ప్రాజెక్టు నీటి కళను సంతరించుకుంది. ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలకు మొట్టమొదటి సారిగా పూర్తి సామర్థ్యంతో 45 టీఎంసీల నీటిని నింపారు. అప్పటి నుంచి ఏటా పైఎత్తున ఉన్న నాగార్జునసాగర్ నిండటం, అక్కడి నుంచి వదిలిన మిగులు నీటితో పులిచింతల ప్రాజెక్టు జలాశయం నిండుతోంది.

2021లో ప్రాజెక్టు ఆధునికీకరణ పనులు

2021 ఆగస్టు 5న ప్రాజెక్టు 16వ నంబరు గేటు నీటి ప్రవాహానికి కొట్టుకు పోయింది. దీంతో జలాశయం మొత్తం ఖాళీ అయింది. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహనరెడ్డి సకాలంలో స్పందించి దీనికి అడ్డుకట్ట వేశారు. రైతాంగం ఇబ్బందులకు గురికాకూడదన్న లక్ష్యంతో యుద్ధ ప్రాతిపదికన తాత్కాలిక ఏర్పాట్లతో తిరిగి 20 రోజుల్లోనే తిరిగి పూర్తి సామర్థ్యంతో ప్రాజెక్టును నింపగలిగారు. రూ.22కోట్లు మంజూరు చేసి గేటు పునర్నిర్మాణంతో పాటు ప్రాజెక్టు ఆధునికీరణ పనుల్ని యుద్ధప్రాతిపదికన చేపట్టంతో ఏటా ప్రాజెక్టులో 45 టీఎంసీల నీటిని నిల్వ ఉంచగలుగుతున్నారు.



2004లో ప్రాజెక్టు నిర్మాణానికి అప్పటి సీఎం వైఎస్సార్ ఆవిష్కరించిన పైలాన్

పెరిగిన భూగర్భ జలాలు

ప్రాజెక్టు పూర్తి సామర్థ్యంతో నీటిని నిల్వ ఉంచడంవల్ల కృష్ణా, డెల్టా ప్రాంత రైతాంగానికి కావలసిన సాగునీరు సక్రమంగా సరఫరా అవుతోంది. ప్రాజెక్టు జలాశయం తీరంలో ఉన్న అచ్చంపేట, బెల్లంకొండ ప్రాంతాల్లో భూగర్భ జలాలు మెరుగు పడ్డాయి. అంతకు ముందు 400 నుంచి 500 అడుగుల వరకు బోర్లు వేసినా చుక్క నీళ్లు పడేవి కావు. ఇప్పుడు 100 అడుగులలోపే పడుతున్నాయి. దీనివల్ల ఈ ప్రాంతాల రైతులు, ప్రజల నీటి సమస్యకు పరిష్కారం దొరికింది.

ఔత్సాహిక వ్యాపారవేత్తలకు ప్రభుత్వం అండ

జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరె

నరసరావుపేట ఈస్ట్: నూతనంగా వ్యాపారం ప్రారంభించాలనే సంకల్పం ఉన్న యువతకు ప్రభుత్వం అండగా ఉంటుందని జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరె తెలిపారు. పల్నాడు జిల్లాలో నూతనంగా వ్యాపారం ప్రారంభించాలనుకున్న యువతకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అంతర్జాతీయ కార్మిక సంస్థ సౌజన్యంతో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జనరేట్ యువర్ బిజినెస్ (జీయూబీ) ప్రోగ్రాం ద్వారా వ్యాపార ఔత్సాహికులకు వాగ్దేవి డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన మూడు రోజుల ఉచిత శిక్షణ తరగతులను జేసీ సూరజ్ గనోరె బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నేటి పోటీ ప్రపంచంలో ప్రతి అంశంలోనూ నైపుణ్యం తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. యువత ఎంచుకున్న వ్యాపార రంగంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ అందించే శిక్షణ ద్వారా మెళకువలు అవగాహన చేసుకొని వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవాలని ఆకాంక్షించారు. తద్వారా మరికొందరికి ఉపాధి కల్పించే అవకాశం ఉంటుందని తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సంజీవరావు మాట్లాడుతూ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు నైపుణ్యాభివృద్ధి సంస్థ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఔత్సాహిక వ్యాపారవేత్తలకు సలహాలు, సహాయ సహకారాలను అందిస్తూ వారి అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు. బ్యాంక్ రుణాలను పొందేందుకు అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాబార్డ్ డిప్యూటీ డైరెక్టర్ శరత్, కళాశాల కార్యదర్శి రాయల శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ కపలవాయి రాజేంద్రప్రసాద్, ఐఎల్‌ఓ ట్రైనర్ వెంకటనారాయణ, కళాశాల డైరెక్టర్లు, అధ్యాపకులు, ఔత్సాహిక వ్యాపార యువత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేసీ సూరజ్ గనోరె

జైన 'ధర్మ'ం..
ధన్య 'వరం'

- ధర్మవరం సమీపంలోని కొండపై లభించిన ఆధారాలు
- బసతుల గుర్తింపుతో జైనం విలసిల్లిన ప్రాంతంగా రూఢీ
- గ్రామ దేవాలయంలో రెండు జైన తీర్థంకరుల విగ్రహాలు
- 24 మంది విగ్రహాలు చెక్కిన ఏక శిల్పం కూడా లభ్యం
- క్రీ.శ. రెండో శతాబ్దానికి చెందినవిగా పురావస్తు శాఖ వెల్లడి

అద్దంకి: బాపట్ల జిల్లాలోని అద్దంకి మండలం పరిధిలో ఉన్న ధర్మవరం గ్రామంలో జైనం విలసిల్లినట్లు చారిత్రక ఆధారాలు స్పష్టం చేస్తున్నాయి. విజయవాడ సమీపంలోని మొగల్రాజపురం, ఉండవల్లి తరువాత ఈ గ్రామమే ఆ స్థాయిలో పేరొందినట్లు తెలిసింది. ఈ గ్రామ సమీపంలోని కొండపై లభించిన ఆధారాలను బట్టి చూస్తే క్రీస్తు శకం రెండో శతాబ్ద ప్రాంతంలో జైన ధర్మం ఇక్కడ ప్రాచుర్యం పొందింది. కొండపై పశువులు, మేకల కాపరులు పెద్ద సైజు ఇటుకల బావిని పోలిన గోతులను గమనించి శాసన పరిశోధకుడు జ్యోతి చంద్రమౌళీకి తెలియజేయడంతో అసలు చరిత్ర వెలుగుచూసింది. పురావస్తు శాఖ చేపట్టిన పరిశోధనల్లో కూడా ఈ విషయాలు తెలిశాయి.

జీవన శైలి ఇలా...

జైనులు నదీ పరివాహక, కొండ ప్రాంతాల్లో ఆవాసాలు ఏర్పాటు చేసుకుని జీవించేవారు. వారంతా అక్కడి మట్టిని కాల్చి ఇటుకలను తయారు చేసుకుని బసతులు (ఆవాసాలు)ను నిర్మించుకునే వారు. వీరిలో దిగంబరులు, శ్వేతాంబరులు, యాపనీలు అనే మూడు శాఖలకు చెందిన వారున్నారు. శ్వేతాంబరులు వస్త్రాలు ధరించినప్పటికీ దిగంబరుల సూత్రాలను పాటిస్తూ ఉంటారు. వీరంతా అహింసావాదులు, శాకాహారులు. ప్రకృతినే ఆరాధించేవారు. తాము నివసించే పరిసరాల్లో లభించే మట్టిని పెద్ద ఇటుకలుగా మార్చి తయారు చేసుకున్న బసతుల్లో నివసించేవారు. పండ్లు, ఇతరత్రా తింటూ జీవనం సాగించేవారు. వీరిలో గొప్ప వారిని తీర్థంకరులుగా పిలుస్తుంటారు. వారిలో వర్ధమాన మహావీర తీర్థంకరుడు పేరు పొందారు. ఆయన విగ్రహం కర్ణాటక రాష్ట్రంలోని శ్రావణ బెళగొళాలో ఉంది. మొత్తం 24 మంది తీర్థంకరులు ఉన్నారు.

కొండపైన లభించిన ఆధారాలు ఇవే..

ధర్మవరం గ్రామ సమీపంలోని వెంకటేశ్వర స్వామి తిప్పపై క్రీస్తు శకం రెండో శతాబ్ద సమయంలో జైనులు నివశించినట్లు ఆధారాలను బట్టి తెలుస్తోంది. 500 అడుగులకు పైగా ఎత్తు కలిగిన ఈ తిప్పపై వారు బసతులు నిర్మించుకున్నారు. వాటి ఆనవాళ్లు ఇప్పటికీ ఉన్నాయి. ఈ ఇటుకలు 18 అంగుళాల పొడవు, 9 అంగుళాల వెడల్పు, 4 అంగుళాల ఎత్తు కలిగి దృఢంగా ఉంటాయి. బసతులు నాలుగు ద్వారాలు కలిగి వంద మీటర్ల వైశాల్యం కలిగి ఉండేవి. ఈ బసతుల మధ్యలో దారి ఉంటుంది. ప్రస్తుతం నిర్మాణాలు శిథిలమైపోగా వాటి ఆనవాళ్లు మాత్రమే లభించాయి. ఈ బసతులకు కొద్ది దూరంలో కొంచెం లోతుతో కూడిన బావిని పోలిన ప్రార్థనా ప్రదేశాలున్నాయి.

గ్రామ దేవాలయంలోనూ..

ధర్మవరం గ్రామంలోని భీమలింగేశ్వర స్వామి ఆలయంలోని వినాయకుడి గుడి ముందు 23వ తీర్థంకరుడైన పార్శ్వనాథుని విగ్రహం బయట పడిది. మల్లికార్జున స్వామి ఆలయం ప్రాంతంలో వర్ధమాన మహావీరుడి విగ్రహం వెలుగుచూసింది. 24 మంది తీర్థంకరుల విగ్రహాలను ఒకే రాతిపై చెక్కిన శిల్పం లభ్యం అయింది. ఇది ప్రస్తుతం హైదరాబాద్‌లోని పురావస్తు మ్యూజియంలో భద్రపరిచారు. క్రీ.శ. 945 ప్రాంతంలో 24వ వర్ధమాన తీర్థంకరుడు పేరు పొందాడు. ఆ సమయంలో ఈ ప్రదేశాన్ని పరిపాలించే అమ్మిరాజు (చాళుక్య ప్రభువు) తన జైన గురువు పేరిట ఒక ఆలయాన్ని కట్టించినట్లుగా తామ్ర శాసనం లభ్యం అయింది.



దేవాలయాల్లో బయటపడిన తీర్థంకరుల విగ్రహాలు



24 మంది తీర్థంకరుల విగ్రహాలు కలిగిన శిల్పం

ఈ-క్రాప్‌కు క్రాఫ్

- జిల్లావ్యాప్తంగా ఇప్పటికి 18శాతం మాత్రమే నమోదు
- సాగులో ఉన్న 1,49,987 ఎకరాలకు గానూ 27,453 పూర్తి
- గతేడాది ఆగస్టుకు 60 శాతం పైగా పూర్తి
- సాంకేతిక లోపాలతో ఈ ఏడాది ఆలస్యమవుతున్న ప్రక్రియ

బెల్లంకొండ: జిల్లాలో ఈ–క్రాప్ నమోదు నత్తనడకన సాగుతోంది. సాంకేతిక సమస్యలు అడ్డంకిగా మారాయి. జిల్లావ్యాప్తంగా వ్యవసాయ శాఖ, రెవెన్యూ సిబ్బంది సంయుక్తంగా నిర్వహిస్తున్నారు. సాంకేతిక సమస్యలతో నిర్దేశించిన సమయానికి పూర్తి చేయలేక తలలు పట్టుకుంటున్నారు. గత ప్రభుత్వం శరవేగంగా పూర్తయింది. రైతు పేరు, పంటల వివరాలు, సాగు విస్తీర్ణం తదితర అంశాలు యాప్‌లో నమోదు అయ్యాయి. దీని ఆధారంగా విపత్తుల సమయంలో పంట నష్టపోతే పరిహారంతో పాటు పూర్తిస్థాయిలో రైతులకు పథకాలు అందేలా గత ప్రభుత్వం కృషి చేసింది. గతేడాది ఇదే సమయానికి 60 శాతం వరకు పూర్తయింది. పల్నాడు జిల్లాలోని 28 మండలాల వ్యాప్తంగా 6,13,672 ఎకరాల్లో వ్యవసాయ భూములున్నాయి. ఈ ఏడాది 1,49,987 ఎకరాల్లో పంటల్ని రైతులు సాగు చేస్తున్నారు. కాగా ఆగస్టు 21వ తేదీ వరకూ 27,453 ఎకరాలు అంటే 18.30 శాతం మాత్రమే ఈ–క్రాప్ నమోదు ప్రక్రియ పూర్తయింది. ఇంకా 1,22,534 ఎకరాల్లో చేయాల్సి ఉంది.



ఈ-క్రాప్ నమోదుపై రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి

ఈ క్రాప్ నమోదు ఇలా...

- రైతుల పొలం వద్దకు అధికారులు వెళ్లి ట్యాబ్‌లో యాప్ ఓపెన్ చేసి క్లిక్ చేయగానే 20 మీటర్ల పరిధిలోని సర్వే నంబర్లు కనిపిస్తాయి.
- సర్వే నంబర్ సాయంతో రైతు పేరును నిర్ధారణ చేసుకుంటారు.
- వేసిన పంటను యాప్‌లో నమోదు చేసుకుంటారు.
- పొలం వద్దే రైతు ఫోటో తీసుకుని యాప్‌లో అప్లోడ్ చేసి, ఆధార్, ఫోన్ నంబర్లు నమోదు చేయాలి.
- దీంతో ఆ సర్వే నంబర్‌కు ఏ కాలువ నుంచి నీరు వస్తుంది, నీటి తీరువా ఎంత చెల్లించాల్సి ఉంది వంటి వివరాలు తెలుస్తాయి.
- పంట చిత్రాలను జీపీఎస్ పద్ధతి ద్వారా సర్వర్‌కు పంపుతారు.
- సర్వే నంబర్లలో తేడాల్ని అధిగమించేందుకు వీఆర్వోలు, ఎంపీఈవోలు సంయుక్తంగా ఈ ప్రక్రియను కొనసాగిస్తారు.

నమోదు ఇలా..

మండలం	శాతం	మండలం	శాతం
రొంపిచర్ల	95.09	చిలకలూరిపేట	17.64
వినుకొండ	94.55	పెదకూరపాడు	17.45
ఈపూరు	89.16	దుర్గి	17.10
శావల్యాపురం	84.62	నరసరావుపేట	15.69
పిడుగురాళ్ల	57.54	ముప్పాళ్ల	14.86
మాచర్ల	39.70	మాచవరం	14.81
కారంపూడి	34.84	గురజాల	14.78
నూజెండ్ల	34.70	బొల్లాపల్లి	13.96
రెంటచింతల	31.73	సత్తెనపల్లి	13.89
దాచేపల్లి	25.89	అచ్చంపేట	11.28
రాజుపాలెం	25.55	బెల్లంకొండ	11.11
యడ్లపాడు	24.40	క్రోసూరు	10.51
నకరికల్లు	23.23	నాదెండ్ల	10.12
వెల్దుర్తి	22.96	అమరావతి	8.47

పూర్తి చేసేందుకు చర్యలు



సర్వర్‌లో సాంకేతిక సమస్యలతో పాటు రుణ అర్హత కార్డుల నమోదు కారణంగా ఈ–క్రాప్ నమోదు ప్రక్రియ ఆలస్యం అయింది. ప్రస్తుతం సాంకేతిక సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకున్నాం. పంటల నమోదులో ఎటువంటి లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. సిబ్బందికి ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు ఇస్తున్నాం. ఈ నెలాఖరులోపు పూర్తి చేస్తాం.

– ఐ.మురళి, జిల్లా వ్యవసాయాధికారి, పల్నాడు జిల్లా

ఈ క్రాప్ నమోదు తప్పనిసరి



రైతులు తప్పనిసరిగా ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలి. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం జరిగినప్పుడు రైతులకు మేలు జరగాలంటే ఈ–క్రాప్ నమోదు అవసరం. ఇప్పటికే మండలంలోని అన్ని గ్రామాల్లో వేగవంతం చేశాం.

– వి.హనుమంతరావు, ఏడీఏ, క్రోసూరు డివిజన్

సత్తెమ్మ తల్లి దేవాలయంలో చోరీ

- ఆరు లక్షల విలువైన ఆభరణాలు, హుండీ ఆదాయం దోపిడీ
- సీసీ కెమెరాలు పగలకొట్టి గర్భగుడిలోకి చొరబడిన దుండగులు

అచ్చంపేట: మండలంలోని మాదిపాడు పంచాయతీ పరిధి అడవిమధ్యలో గల సత్తెమ్మతల్లి ఆలయంలో మంగళవారం రాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. ముందుగా ఆలయం చుట్టూ అమర్చిన ఆరు సీసీ కెమెరాలను పగులకొట్టారు. గర్భాలయంలోకి ప్రవేశించి అమ్మవారి వెండి కిరీటం, శెట గోపురం, భక్తులు సమర్పించిన బంగారు ఆభరాలు దోచుకున్నారు. గర్భాలయంలోని ప్రధాన హుండీ, ఆలయంలో అక్కడడక్కడా అమర్చిన మరో నాలుగింటిని తవ్వి ఎత్తుకుపోయారు. అడవి మధ్యలో పగలకొట్టి అందులో నాలుగు నెలలుగా భక్తులు సమర్పించిన కానుకల్ని దోచుకుని అడవిలోనే వదలి పరారయ్యారు. చోరీకి గురిన మొత్తం రూ.6లక్షలకు పైగా ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. ఆలయ ప్రధాన పూజారి అమ్మవారికి నేవేద్యం పెట్టేందుకు బుధవారం ఉదయాన్నే దేవాలయానికి వచ్చాడు. తలుపులు తెరచి ఉండటం చూసి నివ్వెరపడిపోయాడు. వెంటనే దేవదాయశాఖ కార్యనిర్వహణాధికారి రామకోటిరెడ్డికి, అచ్చంపేట పోలీసుకు సమాచరం అందించారు. ఈవో ఫిర్యాదు మేరకు సత్తెనపల్లి డీఎస్పీ గురునాథబాబు, అచ్చంపేట సీఐ వెంకటప్రసాద్ ఘటనా స్థలాన్ని సందర్శించారు. గుంటూరు నుంచి క్లూస్ టీం, నర్సరావుపేట నుంచి స్పెషన్ టీంలు అన్వేషణ ప్రారంభించాయి. అడవిలో అక్కడక్కడా పగలగొట్టబడి ఉన్న హుండీలను స్వాధీనం చేసుకున్నారు.



సత్తెమ్మ తల్లి ఆలయం

క్లుప్తంగా

నరసరావుపేట డీఎస్పీగా కె.నాగేశ్వరరావు



నరసరావుపేట టౌన్: నరసరావుపేట డీఎస్పీగా కొమ్మనబోయిన నాగేశ్వరరావును నియమించారు. వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్న ఆయన్ను నరసరావుపేట డీఎస్పీగా నియమిస్తూ బుధవారం డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. నాగేశ్వరరావు గత తెలుగుదేశం ప్రభుత్వ హయంలో 2015 నవంబర్ 24 నుంచి 2018 డిసెంబర్ 24 వరకు సుమారు మూడేళ్ళ, మూడు నెలల పాటు నరసరావుపేట డీఎస్పీగా పని చేశారు. తిరిగి పనిచేసిన నరసరావుపేట పోలీస్ సబ్ డివిజన్‌కే ఆయన్ను మరోమారు డీఎస్పీగా నియమించటం గమనార్హం. శుక్రవారం ఆయన ఉద్యోగ బాధ్యతలు చేపట్టనున్నట్లు సమాచారం.

చివరి భూముల వరకు సాగునీరు అందించాలి

టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి

పెదకూరపాడు: నాగార్జున సాగర్ కుడి కాలువ చివరి భూముల వరకు సాగునీరు అందించేలా ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ అధికారులను కోరారు. బుధవారం తన కార్యాలయంలో ఆయన రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ అమరావతి మేజర్ కింద ఉన్న మైనర్ కాలువలను వెంటనే మరమ్మతులు చేసి రైతులకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. నాగర్జున సాగర్, పులిచింతల ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయన్నారు. కాలువల పూడికతీత పనులను యుద్ధ ప్రాదిపతికన ప్రారంభించి, పూర్తిచేయలన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒడిశా కార్మికుడు మృతి

నాదెండ్ల: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒడిశా రాష్ట్రానికి చెందిన వలస కార్మికుడు మృతి చెందాడు. యడ్లపాడు మండలంలోని బోయపాలెం వద్ద జాతీయ రహదారిపై మంగళవారం అర్ధరాత్రి ఈ ప్రమాదం జరిగింది. ఎస్సై వి. బాలకృష్ణ తెలిపిన వివరాల మేరకు యడ్లపాడు ఎస్ఎస్ఎల్ టెక్స్‌టైల్స్‌లో కార్మికుడిగా పనిచేస్తున్న సుదర్శన్‌జైన్ (47) పనుల నిమిత్తం బోయపాలెం వెళ్ళి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనటంతో మృతి చెందాడు. మృతదేహాన్ని చిలకలూరిపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి కుమార్తె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీసీఈఎస్ వివరాల నమోదుతో స్థూల ఉత్పత్తి అంచనా

జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి

నరసరావుపేట: పంటకోత ప్రయోగాల(సీసీఈఎస్) వివరాలను యాప్‌లో పకడ్బందీగా నమోదు చేయటం ద్వారా జిల్లా, మండల, గ్రామ స్థాయిలో స్థూల ఉత్పత్తి అంచనా వేయవచ్చని జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి పేర్కొన్నారు. పంటల బీమా–ప్రధానమంత్రి ఫసల్ బీమాయోజన 2024–25, ఖరీఫ్–2024 ఈ–పంట నమోదుకు సంబంధించి జిల్లా స్థాయి వ్యవసాయ, ఉద్యాన, ఆర్థిక గణాంకశాఖ మండలస్థాయి అధికారులకు బుధవారం మున్సిపల్ అతిథి గృహంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వారిని ఉద్దేశించి మురళి మాట్లాడుతూ గ్రామస్థాయిలో వ్యవసాయ, రెవెన్యూ, ఉద్యాన, మృత్స్యశాఖ, పట్టు పరిశ్రమ, మైక్రో ఇరిగేషన్ అధికారులు అందరూ సమన్వయంతో వాస్తవ సాగుదారు వివరాలను ఈ–పంట ద్వారా నమోదుచేయాలని సూచించారు. జిల్లా ఆర్థిక గణాంకశాఖ అధికారి జి.శ్రీనివాస్ మాట్లాడుతూ సీసీఈఎస్‌ను వరి, కంది, ఎండు మిరప పంటల్లో కేటాయించిన సర్వే నెంబర్లలో దిగుబడి అంచనాలను ఖచ్చితంగా నమోదుచేయాలని, సూపర్‌వైజ్ అధికారులకు ముందస్తుగా పంట కోసే తేదీని తెలియచేసి ఫారం 1, 2, ఏపీ సీసీఈ యాప్, ఎన్‌సీఐపీ యాప్‌లలో నమోదుచేయాలని సూచించారు. నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీసు సీనియర్ స్టాటిస్టికల్ ఆఫీసర్ డి.హనుమంతరావు మాట్లాడుతూ గుంటూరు శాఖ తరపున పది గ్రామాల్లో ఈ–పంట నమోదు, 14 గ్రామాల్లో పంటకోత ప్రయోగాలు ఖచ్చితంగా జరుగుతున్నాయో లేదో పరిశీలించటం జరుగుతుందని హెచ్చరించారు. పంట వివరాల నమోదు, రైతు ఈకేవైసీ వచ్చే నెల 15వ తేదీ నాటికి పూర్తిచేయాలని జిల్లా వ్యవసాయశాఖకు చెందిన అధికారి పి.అరుణ్‌చంద్ర చెప్పారు. జిల్లా ఉద్యానశాఖ అధికారి సీహెచ్.వి.రమణారెడ్డి, జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి సీహెచ్ ఆంజనేయులు, గణాంక అధికారి పి.మాలతీదేవి, సహాయ వ్యవసాయ సంచాలకులు సీహెచ్ రవికుమార్ మాట్లాడుతూ పలు సూచనలు చేశారు.



మున్సిపల్ అతిథి గృహంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఏఓ మురళి

జిల్లాలో 42,316ఎకరాల్లో పీఎండీఎస్

నరసరావుపేట: జిల్లాలో ఇప్పటివరకు ప్రీమాన్ సూన్ డ్రై సోయింగ్ లేదా రుతుపవనాలకు ముందుగా విత్తుకోవడం (పీఎండీఎస్) 42,316 ఎకరాల్లో వేయటం జరిగిందని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ డి.అమలకుమారి పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయంపై వ్యవసాయ శాఖ ఏడీఏలు, ఎంఏఓలకు జిల్లాస్థాయి శిక్షణ కార్యక్రమం బుధవారం పట్టణంలోని మున్సిపల్ అతిథిగృహంలో నిర్వహించారు. అమలకుమారి మాట్లాడుతూ నిరంతరం ఆదాయం వచ్చే రకాలు 12 మందితో నాటించడం జరిగిందన్నారు. ప్రకృతి వ్యవసాయంలో ఆహారం, ఆరోగ్యం విభాగాల ద్వారా ప్రభుత్వ సంస్థల్లో న్యూట్రిగార్డెన్లు, ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు మహిళా సంఘాలకు అందుబాటులో ఉంచడం, పోషక బడులు నిర్వహించి మంచి ఆహారపు అలవాట్లు నేర్పించడం, పెరటి కోళ్ళు, తోటల పెంపకం గురించి అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ప్రతి సోమవారం జిల్లా, మండలస్థాయిలో స్టాల్స్ పెట్టి అందరికీ ఉత్పత్తులు అందుబాటులో ఉంచుతున్నామన్నారు. రసాయన రహిత వ్యవసాయం చేసే వారికి పీజీఎస్ సర్టిఫికెట్ ఇప్పిస్తున్నామన్నారు. జిల్లా యాంకర్ రామచంద్రం మాట్లాడుతూ పీఎండీఎస్ ద్వారా 30రకాల విత్తనాలు, భీజామృతం, ఘనామృతం, గట్లపైన వేసే మొక్కలను గురించి వివరించారు. జిల్లా మండల కేంద్ర అధికారి ఎ.శివకుమారి, ఏడీఏ రవి కుమార్, అదనపు జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ప్రేమ్‌రాజ్, ఏడీఏలు, ఎంఏఓలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యాంకర్ రామచంద్రం

బాలికపై లైంగిక దాడి యత్నం కేసులో నిందితుడు అరెస్టు

బెల్లంకొండ: బాలికపై లైంగిక దాడికి యత్నించిన కేసులో నిందితుడిని బుధవారం అరెస్టు చేసినట్లు బెల్లంకొండ ఎస్ఐ ఎస్.రాజేష్ తెలిపారు. ఎస్ఐ రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రామాంజనేయపురం గ్రామానికి చెందిన నెల్లూరి లోకేష్ అదే గ్రామానికి చెందిన ఓ బాలికపై గత ఆదివారం లైంగిక దాడికి యత్నించినట్లు బాలిక కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు సత్తెనపల్లి డీఎస్పీ గురునాథ్ బాబు, క్రోసూరు సీఐ సురేష్‌లు మంగళవారం గ్రామంలో విచారణ చేపట్టారు. విచారణ అనంతరం బుధవారం మండలంలోని మన్నెసుల్తాన్ పాలెం సమీపంలో నిందితుడిని అరెస్టు చేసినట్లు వెల్లడించారు. నిందితుడిని కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

గుంటూరు పశ్చిమ డీఎస్పీగా జయరాంప్రసాద్

నగరంపాలెం: గుంటూరు పశ్చిమ డీఎస్పీగా బీఎం.జయరాంప్రసాద్ రానున్నారు. ప్రభుత్వం మంగళవారం నిర్వహించిన బదిలీల్లో విశాఖపట్నం సిటీ తూర్పు ఏసీపీగా ఉన్న జయరాంప్రసాద్ ఇక్కడకు రానున్నారు. గతంలో ఇక్కడ డీఎస్పీగా విధులు నిర్వర్తించిన కేవీ మహేష్‌ను హిందుపూర్‌కు బదిలీ చేశారు.

జూడాల కొవ్వొత్తుల ర్యాలీ



గుంటూరు జీజీహెచ్‌లో ధర్నా చేస్తున్న వైద్య విద్యార్థులు



మాట్లాడుతున్న ఘంటసాల శ్రీనివాసరావు, పక్కన ఏన్జీవో నేతలు

గుంటూరు మెడికల్: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై లైంగిక దాడిని ఖండిస్తూ గుంటూరు జీజీహెచ్‌లో ఆంధ్రప్రదేశ్ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేస్తున్న సమ్మె బుధవారం నాటికి తొమ్మిదో రోజుకు చేరింది. రోగుల ప్రాణాలు కాపాడే వైద్యులకు, వైద్య సిబ్బందికి రక్షణ లేకుండా పోయిందని జూడా నాయకులు వాపోయారు. వైద్యులు, సిబ్బందిపై దాడులు నిలువరించేలా ప్రభుత్వాలు కఠిన చట్టాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. నిందితులను తక్షణమే పట్టుకుని కఠినంగా శిక్షించాలని కోరారు. ఏపీ ఎన్జీవో నేతలు, సీఐటీయూ నేతలు, టీచర్స్ యూనియన్ నేతలు జూడాల సమ్మెకు మద్దతుగా బుధవారం ప్లకార్డులు చేతపట్టుకుని నినాదాలు చేస్తూ గుంటూరు నగరంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట మెడికోలు, జూనియర్ డాక్టర్లు నల్లబ్యాడ్జిలు ధరించి ప్లకార్డులు చేతపట్టుకుని బాధితురాలి కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జూడాల సంఘం నేతలు డాక్టర్ పి.దీక్షిత్, డాక్టర్ అన్వర్‌బాషా, డాక్టర్ రవి, డాక్టర్ నిమ్మి, డాక్టర్ చరణ్, డాక్టర్ మనోజ, డాక్టర్ అశ్విని, డాక్టర్ సరిత, హౌస్‌సర్జన్లు బాబి, దీపిక, ఎంబీబీఎస్ వైద్య విద్యార్థులు మోహన్‌చంద్ర, చరణ్ పాల్గొన్నారు.

జూడాలకు ఏపీ ఎన్జీవో మద్దతు

గుంటూరు మెడికల్: కోల్‌కతాలో పీజీ విద్యార్థిపై జరిగిన అమానుష ఘటనపై బుధవారం ఏపీ ఎన్జీవో నేతలు నిరసన తెలిపారు. ఈమేరకు గుంటూరు జీజీహెచ్‌లో జూనియర్ డాక్టర్లు చేస్తున్న సమ్మెకు తమ మద్దతు ప్రకటించారు. జీజీహెచ్‌కు చేరుకుని జూడాలు చేస్తున్న నిరసన కార్యక్రమంలో పాల్గొని మద్దతు తెలిపారు. ఏపీ ఎన్జీ జీఓ అసోసియేషన్ గుంటూరు జిల్లా అధ్యక్షులు ఘంటసాల శ్రీనివాసరావు, కార్యదర్శి శెట్టిపల్లి సతీష్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ నాగూర్ షరీఫ్ హాజరై అసోసియేషన్ తరపున సంఘీభావాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కార్యదర్శి కేఎన్ సుకుమార్, మహిళా సంయుక్త కార్యదర్శి కె.శివజ్యోతి, గుంటూరు నగర అధ్యక్షులు ఎస్‌పీఎస్ సూరి, కార్యదర్శి సిహెచ్ కళ్యాణ్ కుమార్, ఎం శ్రీనివాసరావు, గాబ్రియల్, మహిళా విభాగం చైర్పర్సన్ ఎం.రాధా రాణి, కన్వీనర్ లక్ష్మీ రమ్య తదితర ఉద్యోగులు హాజరై వారి సంఘీభావాన్ని తెలిపారు.

బాధితులకు న్యాయం చేస్తాం

పల్నాడు జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు

పిడుగురాళ్ల: బాధితులకు న్యాయం చేసేందుకే తాము ఉన్నామని పల్నాడు జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు కక్షిదారులకు భరోసా ఇచ్చారు. పిడుగురాళ్ల పట్టణ పోలీస్ స్టేషన్‌కు బుధవారం పల్నాడు జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవల మండలంలోని తుమ్మలచెరువు గ్రామానికి చెందిన నల్లమేకల సైదమ్మ హత్య కేసులో కొంత మంది నిందితులను పోలీసులు విచారిస్తున్నారు. ఈక్రమంలో నిందితులకు సంబంధించిన బంధువులు సైదమ్మ హత్యతో నిందితులకు సంబంధం లేదంటూ పోలీస్‌స్టేషన్‌లో ఎస్పీ శ్రీనివాసరావుకు వినతి పత్రం అందించారు. దీనిపై ఎస్పీ వారితో మాట్లాడుతూ... పోలీసుల విచారణ సమయంలో నిజనిజాలు తెలుస్తాయని, అన్యాయంగా ఎవరిని ఇబ్బంది పెట్టేది ఉండదన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లోని క్రీడా మైదానాన్ని పరిశీలించారు. అలాగే పోలీస్ సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలు రికార్డులను పరిశీలించి, పోలీస్‌లకు పలు సూచనలు, సలహాలు అందించారు.



ఎస్పీకి వినతిపత్రం ఇచ్చిన మహిళలు

హత్య జరిగిన ప్రదేశాన్ని పరిశీలించిన ఎస్పీ..

తుమ్మలచెరువు గ్రామంలో నల్లమేకల సైదమ్మ హత్యకు గురైన పొలాన్ని ఎస్పీ శ్రీనివాసరావు పరిశీలించారు. అలాగే హత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానికులను కూడా విచారించారు. ఎస్పీ వెంట పట్టణ సీఐ వెంకట్రావు, మోహన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధుల తీవ్రత తగ్గే వరకు క్యాంపులు

డీఎంహెచ్ఓ రవి

అచ్చంపేటః వ్యాధుల తీవ్రత తగ్గేవరకు గ్రామాలలో వైద్య శిబిరాలను కొనసాగించాలని, అత్యవసర వైద్యసేవలు అవసరమైన వారిని సత్తెనపల్లి, నరసరావుపేట తరలించాలని పల్నాడు డీఎం అండ్ హెచ్ఓ బి.రవి సూచించారు. పలు గ్రామాలలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను బుధవారం ఆయన సందర్శించారు. పెదపాలెంలో జరుగుతున్న లార్వా సర్వే, ఫీవర్ సర్వేలను పర్యవేక్షించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ స్రవంతి, వైద్యసిబ్బందికి వ్యాధుల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై తగు సూచనలు చేశారు. ఆయన వెంట జిల్లా నోడల్ అధికారి డాక్టర్ హనుమకుమార్, జిల్లా సీహెచ్ఓ హర్షహర్ధన్, మలేరియా సబ్ యూనిట్ అధికారి మొఘల్ సుభానిబేగ్, సీహెచ్ఓ శివనాగేశ్వరి, ఆరోగ్య విస్తరణాధికారి పి.వెంకటరావు, సూపర్‌వైజర్ రాధాకృష్ణ, నాగమల్లేశ్వరరావు, ఎఎల్‌హెచ్‌పి శివనాగమణి, ఎఎన్ఎం దుర్గ, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సూచనలిస్తున్న డీఎంహెచ్ఓ బి.రవి

ఎల్బ్రస్ పర్వతాన్ని అధిరోహించిన తెలుగు యువతి

తాడేపల్లిరూరల్: రష్యాలోని ఎల్బ్రస్ పర్వతాన్ని మన రాష్ట్రానికి చెందిన తెలుగు యువతి అధిరోహించి నేడు ఇండియాకు తిరిగి రానున్నట్లు బంధువులు బుధవారం తెలిపారు. వివరాలు.. తాడేపల్లి పట్టణ పరిధిలోని కొత్తూరు వైఎస్సార్ సెంటర్‌లో నివాసముంటూ ఉద్యోగ రీత్యా యు.ఎ.ఇ.లో ఉంటున్న కొండపు మహేష్‌రెడ్డి భార్య కొండపు అన్నపూర్ణ ఈనెల 19వ తేదీన ఎల్బ్రస్ పర్వతాన్ని అధిరోహించి భారత జాతీయ జెండాను ఎగురవేసింది. 14వ తేదీ మొదటి క్యాంప్ ట్రెక్సాల్ 2000 మీటర్లు, రెండవ క్యాంప్‌లో 3857 మీటర్లు, 16,17, 18, 19 తేదీలలో 4,200 మీటర్లు, 19వ తేదీ ఉదయం 7.54లకు మొత్తం 5,642 మీటర్లు(18510 అడుగుల ఎత్తు) పర్వతాన్ని అధిరోహించారు. అన్నపూర్ణ తండ్రి బండారు శ్రీరామచంద్రరావు(లేటు), తల్లి వెంకటేశ్వరమ్మ మొదట నుంచి ఇలా సాహసాలు చేయడంలో, చదువులో ఎంతో ప్రోత్సహించేవారని, ఆ ప్రోత్సాహంతో ఎంఎస్‌సీ(బయోటెక్) పూర్తి చేయడంతో పాటు బీయిడి పూర్తి చేసి ప్రస్తుతం యు.ఎ.ఇ.లో ఇంటర్నేషనల్ ఇండియన్ స్కూల్‌లో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తోంది. భర్త కంద్రపు మహేష్‌రెడ్డి, చిన్నబాబు బాల వెంకట సిద్దార్థ రెడ్డి ఉన్నప్పటికీ భర్త మహేష్‌రెడ్డి అన్నపూర్ణను ప్రోత్సాహించడంతో నా కుమార్తె అన్నపూర్ణ ఈ సాహసం చేయగలిగిందని తల్లి వెంకటేశ్వరమ్మ తెలిపింది. ఎల్బ్రస్ పర్వతం నిద్రాణమైన అగ్నిపర్వతం ఉన్నప్పటికీ సాహసోపేతంగా ఈ పర్వతాన్ని అధిరోహించడంపై ఆమె స్నేహితులు, బంధువులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



రష్యాలోని ఎల్బ్రస్ పర్వతాన్ని అధిరోహించి జాతీయ జెండాను ప్రదర్శిస్తున్న అన్నపూర్ణ

సీకే గాళ్స్ హైస్కూలులో వాటర్‌ప్లాంట్ ప్రారంభం



మంగళగిరి: పట్టణంలో సీకే గాళ్స్ హైస్కూలుకు రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి ఆధ్వర్యంలో రూ.2.50 లక్షల విలువైన సురక్షిత తాగునీటి ప్లాంటును బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు ఇసునూరి అనిల్ చక్రవర్తి, గాజుల శ్రీనివాసరావు, అన్నే రత్నప్రభాకర్, స్కూలు యాజమాన్యం చింతకింది కళ్యాణ్‌కుమార్, వింజమూరి వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

బాలుడిపై పోక్సో కేసు నమోదు

పట్నంబజారు: మైనర్ బాలికను అపహరించుకుపోయిన బాలుడిపై పోక్సో కేసు నమోదైంది. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాలు.. బొంగరాల బీడుకు చెందిన 16 సంవత్సరాల బాలికను అదే ప్రాంతంలో నివాసం ఉండే 17 ఏళ్ల బాలుడు గత వారం రోజుల క్రితం తీసుకుని హైదరాబాద్ వెళ్లాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. బాలికను తీసుకెళ్లిన ఘటనలో యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని కానిస్టేబుల్ దుర్మరణం

కృష్ణలంక(విజయవాడతూర్పు): లారీ ఢీకొనడంతో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న కానిస్టేబుల్ దుర్మరణం పాలయ్యాడు. ఈ ఘటన కృష్ణలంక పరిధిలోని ఐదో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్–1 సెక్టార్‌లో బుధవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. గుంటూరు జిల్లా మంగళగిరి ఆరో బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కొట్నాని తారక రామారావు(39) పటమట, పంటకాలువ రోడ్డులో భార్య నాగజయశ్రీతో నివసిస్తున్నారు. సంతానం లేకపోవడంతో తారక రామారావు సోదరుడి ఇద్దరు కుమారులను దత్తత తీసుకున్నారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం ఐదు గంటలకు ద్విచక్ర వాహనంపై మంగళగిరి వెళ్లారు. మధ్యాహ్నం విధులు ముగించుకుని భోజనం చేసేందుకు కనకదుర్గ వారధి మీదుగా ఇంటికి బయలుదేరారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో వారధి 47వ పిల్లర్ వద్దకు చేరుకోగానే గుంటూరు వైపు నుంచి విజయవాడకు వేగంగా వస్తున్న లారీ ద్విచక్రవాహనంపై వెళ్తున్న తారక రామారావును బలంగా ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



కానిస్టేబుల్ తారక రామారావు (ఫైల్)

బంద్‌తో ఆర్టీసీ ఆదాయానికి గండి

పట్నంబజారు భారత్ బంద్ నేపథ్యంలో బుధవారం గుంటూరు జిల్లాలో ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి. ఉదయం 10 గంటల వరకు అధికారులు బస్సులు బయటకు తీయవద్దని నిర్ణయించిన ఫలితంగా ఆర్టీసీ ఆదాయానికి గండి పడింది. గుంటూరు 1, 2, తెనాలి, పొన్నూరు, మంగళగిరి డిపోలకు సంబంధించి మొత్తం 393 బస్సులు ఉండగా 250కి పైగా బస్సులు ఉదయం 10 గంటల వరకు నిలిచిపోయాయి. ఈ క్రమంలో కేవలం గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ లోనే 130 బస్సుల వరకు నిలిచిపోయాయి. సచివాలయ ఉద్యోగులు, హైకోర్టు ఉద్యోగులు కోసం మాత్రమే బస్సులు తిప్పారు. బస్సులు నిలిచిన క్రమంలో రూ. 35 లక్షల నుంచి రూ. 40 లక్షల వరకు ఆదాయానికి గండిపడిందని అధికారులు తెలిపారు.

విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు

చేబ్రోలు: విద్యార్థిని అదృశ్యంపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు అందించిన వివరాలు.. మండలంలోని నారాకోడూరుకు చెందిన అమ్మాయి స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతోంది. విద్యార్థిని మంగళవారం అర్ధరాత్రి సమయంలో ఇంటి నుంచి వెళ్లినట్లు అమ్మమ్మ ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. బాలికను అదే గ్రామానికి చెందిన యువకుడు మాయ మాటలు చెప్పి తీసుకువెళ్లినట్లు బంధువులు అనుమానిస్తున్నారు. బాలిక అమ్మమ్మ జి.ముత్తేశ్వరమ్మ ఫిర్యాదు మేరకు చేబ్రోలు ఎస్ఐ పి.వెంకటకృష్ణ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ వితంతు పెన్షన్ అందాలి

గుంటూరు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలావతి

నెహ్రూనగర్: అర్హత కలిగి, నిర్దేశిత ధ్రువ పత్రాలు ఉన్న ప్రతి ఒక్కరికీ వితంతు పెన్షన్ అందుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి.లీలావతి తెలిపారు. వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో గుంటూరు నగరంలో వితంతు పెన్షన్‌లు మంజూరు కాని అర్జీదారులతో, అధికారులతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన శిబిరం బుధవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గుంటూరు నగరంలో సుమారు 6 వందల మంది వితంతు పెన్షన్ మంజూరు కోసం దరఖాస్తు చేసుకున్నారని, వారు తప్పనిసరిగా తమ భర్త మరణ ధ్రువీకరణ పత్రం కూడా దరఖాస్తు చేయాలన్నారు. అర్జీకి జత చేయకపోతే పెన్షన్ మంజూరు కాదన్నారు. పట్టణ పరిధిలో అయితే నెలకు రూ.12 వేలు, గ్రామీణ ప్రాంతం అయితే నెలకు రూ.10 వేల లోపు ఆదాయం కలిగి ఉండి, దారిద్ర్య రేఖకు దిగువున ఉన్న వారు, అన్ని ధ్రువ పత్రాలు అర్జీతో పాటు జత చేసి జిల్లా కోర్టు ప్రాంగణంలోని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో అందించినా సంబంధిత అధికారులకు పంపి పెన్షన్ మంజూరుకు సహకరిస్తామని తెలిపారు. ఒంటరి మహిళలు కూడా పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. కొన్నిసార్లు రోడ్ ప్రమాదం జరిగిన సమయంలో ఏ వాహనం ద్వారా జరిగిందో కూడా తెలియకపోతే సంబంధిత పోలీస్ స్టేషన్ నుంచి ఎఫ్ఐఆర్ కాపీతో తహసీల్దార్‌కి అర్జీ అందిస్తే తీవ్ర గాయాలు జరిగిన వారికి రెండు నెలల్లో రూ.50 వేలు, మరణం సంభవిస్తే వారి కుటుంబ సభ్యులకు రూ.2 లక్షలు అందించడం జరుగుతుందని వివరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న గుంటూరు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలావతి

చిన్నారులకు బైక్‌లు ఇవ్వొద్దు..

తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు ఇష్టానుసారం ద్విచక్ర వాహనాలు ఇవ్వవద్దని, ప్రస్తుత చట్టాల ప్రకారం మైనర్లు బైక్‌లు నడిపినా, ప్రమాదాలు చేసినా వారితో పాటు వారి తల్లిదండ్రులకు కూడా శిక్షలు ఉన్నాయని హెచ్చరించారు. ప్రస్తుతం అనేక ప్రాంతాల్లో 15 నుంచి 17 ఏళ్లలోపు బాలికలపై లైంగిక దాడులు జరుగుతున్నాయని, ఫోక్సో చట్టం ప్రకారం అటువంటి ఘటనల్లో నిందితులకు కఠిన శిక్షలు పడుతున్నాయని చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు సెల్ ఫోన్‌లు ఇచ్చి వదిలి వేయకుండా, వారితో ఎక్కువ సమయం గడపాలని సూచించారు. నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మి మాట్లాడుతూ గుంటూరు నగరపాలక సంస్థలోని 206 వార్డు సచివాలయాల పరిధిలో ఆరు వందల మంది వితంతు పెన్షన్ దరఖాస్తులు ఉన్నాయని, వాటిలో ఎక్కువ శాతం క్షేత్ర స్థాయి పరిశీలన పూర్తి చేశామని వివరించారు. వితంతు పెన్షన్ మంజూరుకు తప్పనిసరిగా నిర్దేశిత ధ్రువ పత్రాలు ఉండాలన్నారు. నగర పరిధిలో ఎవరైనా ఇంకా దరఖాస్తు చేయకుంటే స్థానిక వార్డు సచివాలయంలో అర్జీలు అందించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్ డి.వెంకటలక్ష్మి, న్యాయ సేవాధికార సంస్థ ప్యానెల్ అడ్వకేట్ కట్టా కాళిదాసు, నగరపాలక సంస్థ ఉపా సెల్ పీఓ వేణుబాబు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయండి

తెనాలిఅర్బన్: సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ విలేజ్, వార్డు సెక్రెటరీస్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్ డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా పినపాడులోని కమ్యూనిటీ హాల్‌లో బుధవారం సాయంత్రం కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులకు రెండు ఇంక్రిమెంట్‌లు రావాల్సి ఉందని తెలిపారు. వాటిని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులపై మాతృశాఖ అజమాయిషీ మాత్రం ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం తెనాలి పట్టణ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా షేక్ జానీబాషా, ఉపాధ్యక్షులుగా ఎన్.అజయ్‌కుమార్, వి.భాస్కర్‌లను ఎన్నుకున్నారు.